మళ్లీ వీఆర్వో వ్యవస్థ!



మొదటిపేజీ తరువాయి...

ఇచ్చిపోళ్లకే పనయ్యేది. పేద రైతులు పదులసార్లు ప్రదక్షిణలు చేసినా పట్టించుకోని పరిస్థితి. రైతులకు ఈ దుస్థితిని దూరం చేసేందుకు 2020లో నాటి కేసీఆర్ ప్రభుత్వం వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. గ్రామ రెవెన్యూ అధికారులను ఇతర ప్రభుత్వ శాఖల్లోకి సర్దుబాటు చేసింది. దీంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అయ్యాయి. ఆ నాటి నుంచి రైతులపై, భూములపై వీఆర్వోల అజమాయిషీ లేదు. కంప్యూటర్‌లో ఒక్కసారి భూమి వివరాలు నమోదైతే మార్చే ప్రసక్తే లేదు. ఫలితంగా రైతుల్లో భరోసా పెరిగింది. కానీ.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ వీఆర్వో వ్యవస్థను తెరమీదకి తెచ్చింది. భూభారతి చట్టం ద్వారా ప్రతి గ్రామానికి ఓ రెవెన్యూ అధికారిని నియమించనున్నది. పాత వీఆర్వోలు, వీఆర్ఏలనే మళ్లీ రెవెన్యూ శాఖకు తీసుకొచ్చి వీఆర్వోలుగా నియమిస్తామని ప్రభుత్వం ఇప్పటికే స్పష్టం చేసింది. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. మళ్లీ రాత్రికి రాత్రే తమ తలరాతలు ఎక్కడ మారిపోతాయో అని భయపడుతున్నారు.

రాత్రికి రాత్రే రికార్డులు తారుమారు

గతంలో మ్యానువల్ పద్ధతిలో భూ రికార్డుల నిర్వహణ జరిగినప్పుడు వీఆర్వో రాసిందే రాత..
గీసిందే గీత అన్నట్టుగా సాగేది. లంచం ఇచ్చినవాళ్లకు, పైరవీలు చేసుకున్నవాళ్లకు రికార్డుల్లో కాస్తు కాలమ్‌లో పేర్లు నమోదయ్యేవి. ఆ తర్వాత వారినే యజమానులుగా మార్చి పట్టాలు మంజూరు చేసేవారు. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలానికి చెందిన ఇద్దరు అన్నదమ్ములకు 1995లో తండ్రి నుంచి వారసత్వంగా చెరో 2.03 ఎకరాల భూమి వచ్చింది. 2000 సంవత్సరంలో తమ్ముడి భూమిని అన్న కొనుగోలు చేశాడు. రికార్డుల్లో పేరు మార్చాలని వీఆర్వోకు దరఖాస్తు చేసుకున్నాడు. ఇందుకు రూ.5 వేలు లంచం డిమాండ్ చేయగా.. ఆ రైతు ఇవ్వలేదు. 2018లో భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత ఆ రైతు పేరుమీద 4.06 ఎకరాలకు బదులు 0.3 గుంటల భూమి మాత్రమే ఉన్నది. దీంతో ఆ రైతు లబోదిబోమన్నాడు. లంచం అడిగితే ఇవ్వలేదని వీఆర్వో తన భూమిని వేరే వ్యక్తుల పేర్లమీదికి మార్చాడని ఆరోపించారు. 'పొరబాటున ఆ భూమి వేరే రైతు పేరుమీదికి మారింది' అంటూ ఆ వీఆర్వో చావుకబురు చల్లగా చెప్పాడు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నాయి. ఏదైనా అత్యవసరమై రైతులు తమ భూమిని అమ్ముకోవాలని చూసినప్పుడు రికార్డులు తారుమారైన ఘటనలు వెలుగులోకి వచ్చేవి. దీంతో మళ్లీ అదే వీఆర్వోకు అడిగినంత ముట్టజెప్పి, పై అధికారుల కాళ్లావేళ్లా పడి అడిగినంత సమర్పించుకొని పట్టా మార్పించుకోవాల్సిన పరిస్థితులు ఉండేవి. కొన్నిసార్లు ఎంత ప్రయత్నించినా రికార్డులు మారకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు ప్రయత్నించిన ఉదంతాలు కూడా ఉన్నాయి. పట్టా భూములే కాకుండా వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు, దేవాదాయ శాఖ భూములు అన్యాక్రాంతం కావడంలో వీఆర్వోలు కీలక పాత్ర పోషించారన్న ఆరోపణలున్నాయి. రైతులు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులు అన్ని వర్గాల భూ యజమానులు వీఆర్వోల బాధితులే.

మళ్లీ పాత వీఆర్వోలకు పిలుపు

కాంగ్రెస్ ప్రభుత్వం 2020 ఆర్వోఆర్ చట్టాన్ని రద్దు చేసి, కొత్తగా భూభారతి బిల్లును అసెంబ్లీలో ఆమోదింపజేసిన విషయం తెలిసిందే. దీని ప్రకారం ప్రతి గ్రామానికి ఒక వీఆర్వోను నియమించనున్నారు. వీరికి మళ్లీ భూ రికార్డుల నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు. అందుకోసం కొత్త నియామకాలు చేపట్టకుండా పాత వీఆర్వోలు, వీఆర్ఏలనే నియమిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఇప్పటికే ఆప్షన్లు కూడా తీసుకుంటున్నారు. దీంతో రైతుల్లో మళ్లీ ఆందోళన మొదలైంది. తమ భూములపై మళ్లీ వీఆర్వోల పెత్తనం మొదలవుతుందని, పాత రోజులు మళ్లీ వస్తాయని బిక్కుబిక్కు మంటున్నారు.

రద్దుతో సంబరం

వీఆర్వో వ్యవస్థ చేస్తున్న దారుణాలను గమనించిన కేసీఆర్ ప్రభుత్వం 2020లో సాహసోపేత నిర్ణయం తీసుకున్నది. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు సంబరాలు చేసుకున్నారు. తమ భూములపై ఇతర వ్యక్తుల పెత్తనం పోయిందని ఆనందపడ్డారు. 2020లో తెచ్చిన కొత్త రెవెన్యూ చట్టంతో రికార్డులు కంప్యూటర్‌లోకి వెళ్లాయి. భూ క్రయవిక్రయాలన్నీ ఆన్‌లైన్‌లోనే సాగాయి. రికార్డులు సరళతరం అయ్యాయి. దీంతో గ్రామాల్లో భూ రికార్డుల నిర్వహణ అవసరం లేకుండా పోయింది. వీఆర్వోలకు పనిలేకుండా పోయింది. అందుకే ఆ వ్యవస్థను రద్దు చేశామని నాటి సీఎం కేసీఆర్ చెప్పారు.

విచ్చలవిడి అవినీతికి కేరాఫ్

వీఆర్వో వ్యవస్థ గతంలో విచ్చలవిడి అవినీతికి కేరాఫ్‌గా ఉండేది. డబ్బులు ఇస్తేనే పెన్ను ముట్టే పరిస్థితి. క్రయవిక్రయాలు నమోదు కావాలన్నా, 1బీ కావాలన్నా, పాస్‌బుక్ రావాలన్నా.. ఇలా ఏ పని అయినా లంచం ఇవ్వాల్సిందే. ఏ పనికి ఎంత అన్నది ఫిక్స్ చేసేవారు. 'పాస్‌బుక్ ఇవ్వాలంటే ఒక్కో రైతు రూ.లక్ష ఇవ్వాలని వీఆర్వో డిమాండ్ చేస్తున్నాడు' అంటూ 2019లో రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం నెర్రవల్లి రైతులు తాసిల్దార్‌కు ఫిర్యాదు చేశారు. నల్లగొండ జిల్లా పీఏపల్లి మండలంలోని ఓ వీఆర్వో కొత్త పాస్‌బుక్‌లు, పట్టామార్పిడి కోసం రైతుల నుంచి భారీగా వసూళ్లు చేశాడు. ఒరిజినల్ డాక్యుమెంట్లు తీసుకున్నాడు. ఆ తర్వాత దాదాపు 10 నెలలపాటు పత్తాలేకుండా పోయాడు. దీనిపై బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఫలితం కనిపించలేదు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. ఇలాంటివి ప్రతి రైతుకు ఒక అనుభవమే. ఒకప్పుడు ఏసీబీ నమోదు చేసిన కేసుల్లో రెవెన్యూ శాఖ టాప్‌లో ఉండగా, పట్టుబడినవారిలో ఉన్నతాధికారులతో సమానంగా వీఆర్వోలు ఉండేవారు. వారి వద్ద రూ.కోట్లలో అక్రమాస్తులు బయటపడేవి.

నాగర్‌కర్నూల్ జిల్లా నేరళ్లపల్లిలో మాజీ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి,

మర్రిని పరామర్శించిన సంతోష్

- జంగిరెడ్డి చిత్రపటం వద్ద మాజీ ఎంపీ నివాళి

తిమ్మాజిపేట, డిసెంబర్ 27 : తండ్రిని కోల్పోయిన నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డిని మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ పరామర్శించారు. శుక్రవారం తిమ్మాజిపేట మండలం నేరళ్లపల్లికి ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి వెళ్లిన ఆయన మర్రి తండ్రి జంగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ మలోతు కవిత మర్రిని పరామర్శించారు.

వీఆర్వోలు, వీఆర్ఏలు నాట్ విల్లింగ్!

- వెనక్కి వచ్చేందుకు నేటితో ముగియనున్న గడువు
- సర్వీస్ రూల్స్ లేకపోవడంతో తర్జన భర్జన

హైదరాబాద్, డిసెంబర్ 27(నమస్తే తెలంగాణ): గ్రామాల్లో కొత్తగా వీఆర్వోలుగా పని చేసేందుకు పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు పెద్దగా ఆసక్తి కనబరచడం లేదని రెవెన్యూ వర్గాలు చెప్తున్నాయి. ఇతర శాఖల్లో పనిచేస్తున్న పూర్వ వీఆర్వోలు, వీఆర్ఏలు తిరిగి వచ్చేందుకు విల్లింగ్ ఇవ్వాలని సీసీఎల్‌ఏ ఇటీవల ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ గడువు శనివారంతో ముగియనున్నది. రాష్ట్రవ్యాప్తంగా 10,434 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామానికి ఒక వీఆర్వోను నియమించాలని, మరో వెయ్యి మందిని సర్వేయర్లుగా తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాదాపు 11,500 మందిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తేవాలని భావించింది. గతంలో ఇతర శాఖల్లోకి సర్దుబాటు అయిన వీఆర్వోలు, వీఆర్ఏలు కలిపి దాదాపు 24 వేల మంది వరకు ఉన్నారు. దీంతో కుప్పులుతెప్పలుగా దరఖాస్తులొస్తాయని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వం అంచనాలను తలకిందులు చేస్తూ ఇప్పటివరకు 3,500 మంది వరకు మాత్రమే విల్లింగ్ ఇచ్చినట్టు రెవెన్యూ వర్గాలు తెలిపాయి. నూతన వీఆర్వో వ్యవస్థకు సంబంధించి సర్వీస్ రూల్స్ నిర్ధారణ కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా చెప్తున్నారు. 'ముందు చేరండి.. ఆ తర్వాత బాధ్యతలు, సర్వీస్ నిబంధనలు తెలుస్తాయి' అంటూ ఉన్నతాధికారులు చెప్తున్నారట. అసలు తమ పని ఏమిటో తెలియకుండా ఎందుకు వెళ్లాలని పాత వీఆర్వోలు, వీఆర్ఏలు భావిస్తున్నారు. పైగా గతంలో కన్నా అధికారాలు తక్కువగా ఉండటం కూడా మరో కారణంగా చెప్తున్నారు. విద్యార్హతలు వంటి సాంకేతిక అడ్డంకులు ఉండటంతో సర్వేయర్ పోస్టులో చేరేందుకు వెనుకంజ వేస్తున్నట్టు సమాచారం.

ఈ ఏడాది 41 రోజులు భారీ ఎండలు

వాషింగ్టన్, డిసెంబర్ 27: ఈ ఏడాది ఎండలు మండిపోయాయని.. వాతావరణ మార్పుల వల్ల సగటున 41 రోజులు అదనంగా ఎండలను భరించాల్సి వచ్చిందని శాస్త్రవేత్తలు తెలిపారు. మానవ కార్యకలాపాల వల్ల పెరుగుతున్న వాతావరణ మార్పులపై పరిశోధన చేసిన సైంటిస్టులు గత అధ్యయనాల ఆధారంగా ఈ విషయాలను వెల్లడించారు. 'ఈ పరిణామం ఆశ్చర్యం కలిగించకపోయినా ఆందోళనకరం. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా లక్షలాది ప్రజల జీవితాలు, జీవనోపాధులు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి' అని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్ అండ్ యాన్ ఇంపీరియల్ కాలేజ్ వాతావరణ శాస్త్రవేత్త ఫ్రెడరిక్ ఒట్టో అన్నారు.

జోగులాంబ సన్నిధిలో సుప్రీంకోర్టు జడ్జి

అలంపూర్, డిసెంబర్ 27 : అష్టాదశ శక్తిపీఠాల్లో ఐదో శక్తి పీఠమైన అలంపూర్‌లోని జోగులాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను శుక్రవారం సుప్రీంకోర్టు జడ్జి ఎస్‌వీఎన్ భట్టి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి కమిటీ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ఈవో పురేందర్‌కుమార్ స్వాగతం పలికి, జోగులాంబ జ్ఞాపికను అందజేశారు. వారి వెంట గద్వాల డీఎస్పీ సత్యనారాయణ, అలంపూర్ సీఐ రవిబాబు, ఎస్సై వెంకటస్వామి, తాసీల్దార్ మంజుల ఉన్నారు.

అలంపూర్‌లోని జోగులాంబ ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యులు, అధికారులు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారికి సర్వీస్ పనిష్‌మెంట్

న్యాయస్థానం ప్రాంగణంలో నిందితులతో శ్రమదానం చేయిస్తున్న పోలీసులు

శక్కర్‌నగర్, డిసెంబర్27: పట్టణంలోని పలు ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారికి శుక్రవారం బోధన్ ద్వితీయశ్రేణి న్యాయమూర్తి శేష తల్ప సాయి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు. పట్టణంలోని రాకాసీపేట్‌కు చెందిన ముగ్గురు, గోసం కాలనీకి చెందిన ఐదుగురు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించగా వారిని పట్టుకుని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ శుక్రవారం న్యాయస్థానంలో హాజరుపర్చారు. ఈ మేరకు సదరు వ్యక్తులకు కమ్యూనిటీ సర్వీస్ పనిష్‌మెంట్ విధిస్తూ తీర్పు చెప్పారు. న్యాయమూర్తి తీర్పు మేరకు వీరితో పోలీసులు కోర్టు ఆవరణ శుభ్రం చేయించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తప్పవని పట్టణ సీఐ హెచ్చరించారు.

విలీన సభను విజయవంతం చేయండి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

శక్కర్‌నగర్, డిసెంబర్ 27: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించనున్న రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీనసభను విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ డివిజన్ సహాయ కార్యదర్శి గౌతం కుమార్ కోరారు. శుక్రవారం బోధన్ పట్టణంలో ఆ పార్టీ నాయకులతో కలిసి ఆయన విలీన సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ విప్లవ పార్టీలు చీలికకు గురవుతున్న కారణంగా ఉద్యమాలు సన్నగిల్లాయని అన్నారు. విప్లవకారుల ఐక్యతే ధ్యేయంగా న్యూడెమోక్రసీ పార్టీల విలీనసభను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ నాయకులు చిన్న పర్వయ్య, సూర్య విఠల్, దాల్‌మల్క పోశెట్టి, సుధాకర్, జైరాం, అన్వర్, అఫ్రీద్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

వరదకాలువ రైతులకు దొంగల భయం

వరదకాలువ పక్కన స్తంభాలకు రైతులు అమర్చిన స్టార్టర్లు

- తరచూ వైర్లు చోరీచేస్తున్న దొంగలు
- రైతులకు పెరుగుతున్న ఖర్చు
- దొంగలపై పోలీసులు నిఘాపెట్టాలని కోరుతున్న రైతులు

మోర్తాడ్, డిసెంబర్ 27 : సాగునీటికి వరప్రదాయినిగా మారిన వరదకాలువ రైతులు దొంగల బెడదతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దొంగల కారణంగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని వాపోతున్నారు. బాల్కొండ నియోజకవర్గంలోని బస్వాపూర్, కిసాన్‌నగర్, వన్నెల్ (బీ), బోదెపల్లి, పోచంపల్లి, దొన్కల్, గాండ్లపేట్, మోర్తాడ్, పాలెం, తిమ్మాపూర్, కమ్మర్‌పల్లి, నాగాపూర్ గ్రామాల మీదుగా వరదకాలువ వెళ్తున్నది. ఈ గ్రామాల రైతులందరూ వరదకాలువ పై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. వరద కలువలో మోటర్లు పెట్టుకొని, పైపుల ద్వారా కాలువ నీటిని పొలాలకు తరలిస్తారు. దాదాపు వేల ఎకరాలు ఈ వరద కాలువ నీటితోనే సాగవుతున్నాయి.

తరచూ వైర్ల చోరీతో ఇబ్బందులు..

రైతులు వరదకాలువ నీటిలో మోటరును ఉంచి, విద్యుత్ స్తంభానికి స్టార్టర్ బాక్స్‌ను అమర్చి, అక్కడి నుంచి వైర్ల ద్వారా మోటరుకు విద్యుత్ కనెక్షన్ ఇస్తారు. రైతులు అవసరమున్న సమయంలో స్టార్టర్ బాక్స్ వద్ద మోటరును స్టార్ట్ చేసి వ్యవసాయ భూములకు నీటిని అందిస్తుంటారు. స్టార్టర్ బాక్స్ మోటరు మధ్యన ఉన్న వైరును దొంగలు తరచూ ఎత్తుకెళ్తున్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారానికి ఒకసారి వైర్ల దొంగతనం జరుగుతూనే ఉన్నదని, తిరిగి వైర్లను ఏర్పాటు చేయించుకునేందుకు రూ.2 వేల నుంచి రూ.3వేల వరకు ఖర్చు అవుతున్నదని, వైర్లు ఏర్పాటు చేయించే వరకు పంటలకు నీరందించని పరిస్థితి ఏర్పడుతున్నదని రైతులు వాపోతున్నారు.

పోలీసులు నిఘా పెట్టాలి

తరచూ దొంగతనాల కారణంగా పంటలు సరిగా పండించుకోలేకపోతున్నామని రైతులు చెబుతున్నారు. దొంగలను పట్టుకోవాలని రైతులు సంబంధిత పోలీస్‌స్టేషన్లలో కూడా ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. వరదకాలువల వద్ద వైర్ల దొంగతనాలపై పోలీసులు నిఘాపెట్టాలని రైతులు కోరుతున్నారు.

స్టార్టర్‌బాక్స్ వద్ద వైర్లను అమర్చుతున్న రైతు

వరదకాలువ నుంచి మోటరు ద్వారా నీటిని తీసుకోవడానికి ఏర్పాటు చేసుకున్న పైపులు

రూ.3వేల వరకు ఖర్చు అవుతుంది

వైర్ల దొంగతనం జరిగితే తిరిగి వాటిని ఏర్పాటు చేయించేందుకు రూ.3 వేల వరకు ఖర్చయితున్నది. వారం పదిరోజులకు ఒకసారి ఇదే పరిస్థితి ఉంటున్నది. దొంగతనం జరిగిన ప్రతిసారీ కొత్త వైర్లు కొని, ఎలక్ట్రిషియన్‌ను పిలిపించి పని చేయించుకోవాలి. ఇట్ల ఏడాదికి వేల రూపాలు నష్టపోతున్నాం.

- గోపిడి గంగారెడ్డి, రైతు, తిమ్మాపూర్

పోలీసులు దృష్టి సారించాలి

వరదకాలువలో నీరు ఉండడంతో దూరంగా ఉన్నవారు కూడా పైప్‌లైన్లు వేసుకొని పంటలు పండించుకుంటున్నారు. కానీ వరదకాలువ వెంట జరుగుతున్న దొంగతనాలు రైతులకు కన్నీరు తెప్పిస్తున్నది. దొంగతనాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి, వైర్లు దొంగతనం కాకుండా చూడాలి.

- ప్రభుదాస్, రైతు, తిమ్మాపూర్

పత్తి లారీ బోల్తా

నవీపేట, డిసెంబర్ 26: మండల కేంద్రంలో శుక్రవారం పత్తి లారీ బోల్తాపడిన ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. నిజామాబాద్ నుంచి మహారాష్ట్ర వైపు పత్తి లారీ వెళ్తున్నది. మండల కేంద్రంలోని బాసర ప్రధాన రోడ్డుపై రైల్వే గేటు మరమ్మతు పనులు కొనసాగుతున్న విషయం తెలియక పత్తి లారీని డ్రైవర్ నేరుగా గేటు వద్దకు తెచ్చాడు. గేటు మూసి ఉంచడంతో లారీని వెనక్కి తీసుకునే క్రమంలో రోడ్డు పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. ఈ విషయంలో ఫిర్యాదు అందలేదని ఎస్సై వినయ్ పేర్కొన్నారు.

'క్రిస్మస్' క్రీడా పోటీలు ప్రారంభం

మాక్లూర్, డిసెంబర్27: మండలంలోని మెట్టు గ్రామంలో శుక్రవారం 38వ కిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శుక్రవారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. చర్చి ఫాదర్ ప్లాంక్లిన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలు ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు క్రీడా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. వాలీబాల్ పోటీల్లో 12 గ్రామాల నుంచి జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు ప్రసాద్‌రాజు తెలిపారు. వీడీసీ అధ్యక్షుడు బుంగ అబ్రహం, నామ రత్నం క్రీడాకారులకు ఏర్పాట్లు చేశారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కార్యదర్శి, ప్రశాంత్, ఫిజికల్ డైరెక్టర్లు ప్రసాద్‌రాజు, సునీల్, పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

కామారెడ్డి, డిసెంబర్ 27 : మహిళ మెడలో నుంచి ఆభరణాలు దొంగిలించి, హత్యచేసిన నిందితుడికి కోర్టు జీవితఖైదుతో పాటు రూ.20 వేల జరిమానా విధించింది. ఎస్సీ సింధూశర్మ వెల్లడించిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన షేర్ల సుజాత.. తన భర్త చనిపోవడం, ఆమె కుమారుడు హైదరాబాద్‌లో ఉంటుండడంతో ఒంటరిగా ఉంటున్నది. ఆమెకు డిసెంబర్ 10, 2022న కుమారుడు శివరాములు ఫోన్ చేయగా ఎంతకీ లిఫ్ట్ చేయలేదు. అనుమానం వచ్చి, ఇంటికి వచ్చి చూసే సరికి తన తల్లి గొంతుపై బలమైన గాయం ఉండడంతోపాటు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించాడు. శివరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. సుజాత ఇంటిపక్కనే ఉన్న గంగుల శ్రీనివాస్ అలియాస్ డీజే శ్రీనును అదుపులోకి తీసుకున్నారు. విచారణ చేపట్టిన పోలీసులు గంగుల శ్రీనివాస్ నగలను చోరీ చేసి, హత్య చేసినట్లు గుర్తించారు. నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్ఆర్ వరప్రసాద్ నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ. 20 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. కేసును విచారణ చేపట్టిన అప్పటి ఎల్లారెడ్డి సీఐ శ్రీనివాస్, ఎస్సై గణేశ్, ప్రస్తుత పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్‌గౌడ్, కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టిన ప్రస్తుత సీఐ రవీంద్రనాయక్, ఎస్సై మహేశ్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై మురళి, కోర్టు కానిస్టేబుల్ సాయిలు, ప్రసాద్‌గౌడ్‌ను ఎస్పీ అభినందించారు.

మురికి కాలువలను శుభ్రం చేయించండి సారూ..

దుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీలు

దేశాయిపేట్‌లో చెత్తతో నిండిన మురికి కాలువ

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 27 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో మురికి కాలువలు మురికి నీటితో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో దోమల బెడద ఎక్కువైందని గ్రామస్తులు తెలిపారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాల్సి ఉండగా, కొన్ని రోజుల నుంచి శుభ్రం చేయించకపోవడంతో పూడిక, చెత్త భారీగా పేరుకుపోయింది. కొన్ని కాలనీల్లో డ్రైనేజీల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి నీరు నిల్వ ఉండేలా చేస్తున్నాయని తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని గ్రామంలో మురికి కాలువలను శుభ్రం చేయించి, తాము రోగాల బారిన పడకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పిచ్చి మొలకలు, మురికి నీటితో నిండిన డ్రైనేజీ